కేసీఆర్ పోరాటాల ఫలితమే తెలంగాణ రాష్ట్రం



దీక్షాదివస్‌లో మాట్లాడుతున్న మహమూద్ అలీ

- మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ
- జిల్లా కార్యాలయంలో కేసీఆర్ దీక్షా దివస్

శంషాబాద్: ప్రాణాలకు తెగించి కేసీఆర్ చేసిన పోరాటాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్ర కల సాకారం అయ్యిందని మాజీ హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2009 నవంబర్ 29 కేసీఆర్ దీక్ష చేపట్టిన రోజు కారణంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన శంషాబాద్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం దీక్షా దివస్‌ను నిర్వహించారు. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ సాధన కోసం పదవులన్నింటినీ తృణప్రాయంగా వదులుకున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ఉద్యమ సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కేసీఆర్ చేసిన దీక్ష ఫలితంగానే అప్పటి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యమకారులు ఉద్యమ సమయంలోని విషయాలను గుర్తు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీపీ జయమ్మ, కౌన్సిలర్ భారతమ్మ, బీఆర్ఎస్ నాయకులు కె.శంకర్‌రెడ్డి, చక్రధర్ రెడ్డి, కొనమొల్ల శ్రీనివాస్, మోహన్‌రావు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మణికొండలో..

మణికొండ: తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అనే నినాదంతో కేసీఆర్ ఆమరణ దీక్ష బూనిన నవంబర్ 29వ తేదీని శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు దీక్షాదివస్‌గా జరుపుకొన్నారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని పలు ప్రాంతాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ర్యాలీగా శంషాబాద్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగే దీక్షా దివస్ కార్యక్రమానికి తరలివెళ్లారు. మణికొండ మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ధన్‌రాజ్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, సీనియర్ నాయకులు లక్ష్మయ్య, లక్ష్మణ్ రావు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, కిరణ్, రామసుబ్బారెడ్డి, మల్లేష్, రాజేంద్రప్రసాద్, విజయలక్ష్మి, షేక్ ఆరీఫ్, దిలిప్‌కుమార్, రేఖ, సుమ తదితరులు పాల్గొన్నారు.



మైలార్‌దేవ్‌పల్లి చౌరస్తాలో...

అత్తాపూర్‌లో...

అత్తాపూర్: తెలంగాణ సాధన కోసం కేసీఆర్ తన ప్రాణాలను సైతం లెక్క చేయలేదని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అప్పారెడ్డి ముఖేష్ అన్నారు. దీక్ష దివస్ సందర్భంగా అత్తాపూర్ చౌరస్తాలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. పార్టీ స్థానిక నేతలు లక్ష్మణ్, సతీష్, జైపాల్, అంజి తదితరులు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర సాధనకు కేసీఆర్ నినాదాన్ని ప్రజలు మరువలేదని మైలార్‌దేవ్‌పల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి చౌరస్తాలో యువజన విభాగం అధ్యక్షుడు అక్కెం రఘుయాదవ్ ఆధ్వర్యంలో తెలంగాణ జెండాను ఆవిష్కరించి దీక్షాదివస్‌ను ఘనంగా నిర్వహించారు. నేతలు రమేష్ ముదిరాజ్, నోముల రాము యాదవ్, రాజేష్ యాదవ్, మైసిరెడ్డి, అరుణ్ ముదిరాజ్, యాదగిరి భాస్కర్, మంచర్ల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



మణికొండలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు సీతారం



అత్తాపూర్‌లో...

అధిక శబ్దం వస్తున్న సైలెన్సర్ల ధ్వంసం

అత్తాపూర్: ట్రాఫిక్ సమస్యలు, ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎ.బాలాజీ అన్నారు. స్టేషన్ పరిధిలో సౌండ్ పొల్యూషన్ అధికం అవుతున్న నేపథ్యంలో శుక్రవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అత్యధిక శబ్దం వస్తున్న 42 వాహనాల సైలెన్సర్లను గుర్తించారు. ఆయా సైలెన్సర్లను బుల్డోజర్‌తో ధ్వంసం చేయించారు. మొత్తం 42 సైలెన్సర్ల విలువ రూ. 10 లక్షల వరకు ఉంటుందన్నారు. ఇలా ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఎవరైనా ప్రయత్నిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సైలెన్సర్లను బుల్డోజర్‌తో ధ్వంసం చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సింహగర్జన సభను జయప్రదం చేయండి

రాజేంద్రనగర్: నగరంలో డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహ గర్జన సభ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలి రావాలని సింహ గర్జన సభ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పంబల రాజు పిలుపునిచ్చారు. చెన్నూరు ఎమ్మెల్యే వెంకటస్వామి నిర్వహించే కార్యక్రమానికి వేలాదిగా మాలలు, మాల సంఘాలు కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.



పంబల రాజు

వైజ్ఞానిక ప్రదర్శనలతో ప్రతిభకు పదును

- శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి
- శంషాబాద్‌లో జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం



వైజ్ఞానిక అంశాలను తిలకిస్తున్న మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి తదితరులు

శంషాబాద్ రూరల్: విద్యార్థుల్లో దాగిన నైపుణ్యాలను వెలికితీయడంలో వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో ఉపకరిస్తాయని.. తద్వారా వారి ప్రతిభకు మరింత మెరుగు పరచేందుకూ దోహదపడుతాయని శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఒయాసిస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన 52వ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ అవార్డుల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ... దేశం సైన్స్‌లో ఎంతో పురోభివృద్ధి సాధించిందన్నారు. భవిష్యతులో మరిన్ని ఫలితాలు సాధించాలంటే విద్యార్థులు ఆ దిశగా ఇప్పటి నుంచే కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైజ్ఞానిక ప్రదర్శన దినాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

❖ ఎమ్మెల్సీ ఎ.వి.ఎన్.రెడ్డి మాట్లాడుతూ... పాఠశాల, కళాశాలల స్థాయిలో విద్యార్థులు ప్రాక్టికల్స్‌పై దృష్టి పెట్టకపోవడంతో ఉన్నత చదువుల్లో రాణించలేకపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఒకే చోట వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు.

❖ ప్రదర్శనలను రెండు రోజులకే పరిమితం కాకుండా కనీసం ఐదు రోజులపాటు నిర్వహిస్తే ఎక్కువ మంది విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు.

❖ జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ... ఈ కార్యక్రమంలో 400 ప్రాజెక్టులు ప్రదర్శించడం విశేషమన్నారు. విజ్ఞానంపై విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకు ఈ ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు తప్పనిసరిగా ఈ ప్రదర్శనలు తిలకించి అవగాహన పెంచుకోవాలన్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించగా.. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, డీఈఓ సుశీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కార్తీక పూజలు



రాజేంద్రనగర్: బుద్వేల్ టీచర్స్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ ఆలయంలో కార్తీక మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, లలిత సహస్రనామ పారాయణం, అమ్మవారికి కుంకుమార్చన, కార్తీక దీపాలంకరణ తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. పూజల్లో పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ అండ్ ఫౌండర్ కోరని శ్యామ్, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బండ్లగూడ అభివృద్ధిపై కౌన్సిల్‌లో సమీక్ష



మాట్లాడుతున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన, చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో సమీక్షించారు. మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అభివృద్ధి పనుల కోసం తీర్మానాలు చేశారు. వీడీసీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ. 12.05 కోట్లు, యూజీడీ నిర్మాణం కోసం రూ. 4.70 కోట్లు, కమ్యూనిటీ హాల్‌లు నిర్మాణం కోసం రూ. 4.05 కోట్లు, పార్కులు, అత్యవసర వస్తువుల కోసం రూ. 1.35 కోట్లు, ఇతర పనులకు రూ. 4.98 కోట్లను కేటాయిస్తూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కమిషనర్ శరత్‌చంద్ర, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించండి

జిల్లా ఇంచార్జి మంత్రిని కోరిన కాంగ్రెస్ నాయకులు



మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన మణికొండ కాంగ్రెస్ నాయకులు

మణికొండ: నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించి వారికి ఉపశమనం కలిగించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్‌బాబును మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు కోరారు. శుక్రవారం ఆయనను కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జితేందర్ ఆధ్వర్యంలో వారు ఆయనను కలిసి ప్రజా సమస్యలను ఆయనకు వివరించి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలో అసంపూర్తిగా నిలిచిపోయిన నెక్నాంపూర్ చెరువు సుందరీకరణ, తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతుండటంతో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు, అశోకా లివియానా అపార్ట్‌మెంట్‌కు ఫీజు కట్టినా కనెక్షన్ ఇవ్వకుండా అధికారులు పెడుతున్న ఇబ్బంది, ఆర్ఎంసీ ప్లాంట్లతో ప్రజలు దుమ్ము, ధూళి, శబ్దాలతో పడుతున్న ఇబ్బందులు, కనెక్టింగ్ రోడ్లు లేక ప్రజల ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు పార్టీ అధ్యక్షుడు తెలిపారు. ప్రతి సమస్యపై కూలంకషంగా వివరించి వాటిని పరిష్కరిస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మంత్రికి వివరించామన్నారు. కష్టకాలంలో పార్టీ కోసం శ్రమించిన నాయకులకే నామినేటెడ్ పదవులను ఇవ్వాలని కోరామన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామి ఇచ్చారని ఆయన వివరించారు. పార్టీ మున్సిపల్ శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, కౌన్సిలర్‌లు కె.లక్ష్మీనారాయణ, డి.పురుషోత్తం, నాయకులు ముత్యాలు, మహేష్‌రెడ్డి, కె.శ్రావణ్‌కుమార్, శరత్, మైనార్టీ అధ్యక్షుడు షేక్ హాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ప్రజావసరాలకే వినియోగించాలి



సెప్టిక్ ట్యాంక్ స్థలం వద్ద ఆందోళన చేస్తున్న వెంకటేశ్వర కాలనీవాసులు

మణికొండ: ప్రజావసరాల కోసం నిర్దేశించిన సెప్టిక్‌ట్యాంక్, పార్కు స్థలాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన అనుమతులను రద్దు చేసి వాటిని పరిరక్షించాలని ప్రజలు డిమాండ్ చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 22/పి, 23, 24, 25, 26లలో వెంకటేశ్వర కాలనీ లేఅవుట్ వేశారు. మొదటగా అప్పటి హుడాకు లేఅవుట్ దరఖాస్తు చేయగా పలు కారణాలతో మంజూరు కాలేదు. దాంతో పంచాయతీ అనుమతులతో ఏర్పాటు చేశారు. లేఅవుట్ హెచ్ఎండీఏ నిబంధనల మేరకు ఉండటంతో దాన్ని అలాగే పరిగణించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. సదరు లేవుట్‌లోని పార్కులు, ఓపెన్ స్థలాలను రియల్టర్లు అమ్మకాలు చేపట్టారు. వాటిల్లో భాగంగా కొంత స్థలాన్ని సెప్టిక్‌ట్యాంక్‌కు కేటాయించారు. అలాంటి స్థలానికి లేఅవుట్‌లో లేని 336, 337 నెంబర్లు వేసి అమ్మకాలు నిర్వహించారు. లేఅవుట్ నిబంధనలు పట్టించుకోకుండా ఇరిగేషన్‌శాఖలోని ఓ అధికారి తప్పుడు నివేదికల ఆధారంగా ఏకంగా హెచ్ఎండీఏ భవన నిర్మాణ అనుమతులు జారీ చేసింది. సదరు స్థలం పక్కనుంచి ఉన్న పందెన్ వాగుకు నిబంధనల ప్రకారం 9 మీటర్లు బఫర్ వదలాల్సి ఉండగా కేవలం 2 మీటర్లు మాత్రమే వదలి అనుమతులు ఇచ్చారు. దాంతో కాలనీ వాసులు నిబంధనలకు విరుద్ధంగా ఇరిగేషన్ శాఖ తప్పుడు ఎన్ఓసీతో ఇచ్చిన అనుమతులను రద్దు చేసి ప్రజలకు ఉపయోగపడే స్థలాన్ని కాపాడాలని కాలనీవాసులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. హైడ్రా కమిషనర్ స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉపేంద్రనాథ్‌రెడ్డి, కాలనీ వాసులు సందీప్, జస్వంత్, అష్రఫ్, నాగరాజు, మల్లికార్జున్‌రెడ్డి, స్వప్న, సుజాత, రాధిక, పారిజాత, అనిత, నరసింహారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

పార్కులో సౌకర్యాలపై డీసీకి వినతి



డీసీకి వినతిపత్రం ఇస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లిలోని పెద్ద తాళ్లకుంట పార్కులో కనీస సౌకర్యాలను కల్పించాలని పెద్ద తాళ్లకుంట వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. శుక్రవారం పెద్ద తాళ్లకుంట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ... ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉన్న పెద్ద తాళ్లకుంట పార్కులో సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేయాలన్నారు. సెక్యూరిటీ గార్డు లేకపోవడంతో రాత్రి 9 గంటల అనంతరం పార్కులో అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడుతూ మద్యం సేవిస్తూ బాటిళ్లను అక్కడే పడేస్తున్నారన్నారు. పార్కులో స్ట్రీట్ లైట్లు, పార్కుకు ఫెన్సింగ్, తాగు నీటి సౌకర్యం కల్పించాలన్నారు. పెద్ద తాళ్లకుంట పార్కులో సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన డీసీ రవికుమార్ తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాసులు, జంగయ్య, మల్లికార్జున్ రెడ్డి, దుర్గాదాస్, హరినాథ్, లక్ష్మారెడ్డి, ఆర్.కె.షిండే తదితరులు పాల్గొన్నారు.

వైన్ షాపులో మద్యం బాటిళ్ల చోరీ

శంషాబాద్ రూరల్: పాల్మాకులలోని ఓ వైన్ షాపులో గుర్తుతెలియని వ్యక్తులు మద్యం బాటిళ్లను చోరీ చేశారు. వివరాలివీ... శుక్రవారం తెల్లవారుజామున వైన్ షాప్ గోడకు కన్నం వేసి లోపలికి చొరబడ్డారు. కౌంటర్‌లో వెతికినా అందులో నగదు లేకపోవడంతో ఆరు మద్యం బాటిళ్లను తీసుకెళ్లారు. గోడ కన్నం నుంచి ఎక్కువ మొత్తంలో మద్యం బాటిళ్లను తీసుకెళ్లేందుకు యత్నించిన దుండగులు అది సాధ్యం కాకపోవడంతో గోడ బయట వదిలి వెళ్లారు. ఉదయం గమనించిన కూలీలు పోలీసులకు సమాచారం అందించారు. సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాలకృత్యాలకూ కష్టమే..!

- అర్ధాంతరంగా ఆగిన పబ్లిక్ టాయిలెట్‌ల నిర్మాణం
- ప్రజలకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం



నిలిచిపోయిన పబ్లిక్ టాయిలెట్ నిర్మాణ పనులు

రాజేంద్రనగర్: ప్రజల అవసరాల కోసం నిర్మిస్తున్న పబ్లిక్ టాయిలెట్స్ పనులను అర్ధాంతరంగా ఆపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆరు నెలలుగా పనులు నిలిచిపోవడంతో రోజురోజుకూ ఇబ్బందులు అధికం అవుతున్నాయి.

❖ రాజేంద్రనగర్ పీడీపీ చౌరస్తా వద్ద ప్రయాణికులు, వాహనదారుల కోసం వాల్మీకి యూ లేబర్ కాంట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పబ్లిక్ టాయిలెట్లను తన సొంత ఖర్చుతో నిర్మించేందుకు ముందుకొచ్చింది. పీడీపీ చౌరస్తా ప్రాంతంలో ఎలాంటి పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడంతో ఈ ప్రాంతంలో నిర్మించేందుకు ముందుకొచ్చారు. ఇదే విషయమై జీహెచ్ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్, రాజేంద్రనగర్ ఉప కమిషనర్‌ను సంప్రదించారు.

❖ చౌరస్తా ప్రాంతంలో రోజూ ప్రయాణికుల రాకపోకలు అధికంగా ఉండటంతో ప్రజల సౌకర్యార్థం పబ్లిక్ టాయిలెట్లు నిర్మిస్తే బాగుంటుందని గతంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ అధికారులను కోరారు.

❖ వాల్మీకి సమాజ్ ముందుకు రావడంతో జీహెచ్ఎంసీ అధికారులు జూన్ 28వ తేదీన పనులను నిర్వహించేందుకు వర్క్ ఆర్డర్ ఇచ్చారు. పనులను ప్రారంభించగా.. ఇదే ప్రాంతంలోని వెటర్నరీ యూనివర్సిటీ అధికారులు పనులను నిలుపుదల చేశారు. ఈ విషయమై వాల్మీకి సమాజ్ నిర్వాహకులు అధికారుల చుట్టు తిరుగుతున్నా.. పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ప్రజల సౌకర్యార్థం తామే సొంతంగా నిధులను సమకూర్చి పబ్లిక్ టాయిలెట్లను నిర్మించేందుకు ముందుకొస్తే పనులను అడ్డుకోవడం సరి కాదని విచారం వ్యక్తం చేస్తున్నారు.

❖ అందరికీ సౌలభ్యంగా ఉండేలా తాము పనులను చేపడుతున్నట్లు తెలిపారు. చౌరస్తాలో ప్రాంతంలో వృద్ధులు, మహిళలు, అనేక మంది వ్యాపారులు రాకపోకలు సాగిస్తుంటారని.. దీంతో పాటు మూడు యూనివర్సిటీలు, 56 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యాలయాల సిబ్బంది ఈ ప్రాంతం గుండా రాకపోకలు సాగిస్తారన్నారు. వీరందరికీ ఈ పబ్లిక్ టాయిలెట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పబ్లిక్ టాయిలెట్ కారణంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలుపుతున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి పబ్లిక్ టాయిలెట్ పనులను వెంటనే నిర్వహించేలా చూడాలని కోరుతున్నారు.

పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర

బండ్లగూడ: పారిశుద్ధ్య కార్మికులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. 11వ డివిజన్‌లోని దర్గా ఖలీజ్‌ఖాన్, 20వ డివిజన్‌లోని వికాస్‌నగర్‌లలో పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ప్రధాన రహదారులపై స్వీపింగ్ పనులను ఎప్పటికప్పుడు నిర్వహించేలా చూడాలన్నారు. అలాగే 19వ డివిజన్‌లోని ప్రశాంత్‌నగర్‌లో తడి, పొడి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జవాన్లు నరేందర్, నవీన్, యాదగిరి, రాము తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలి



ప్రశాంత్‌నగర్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న జిల్లా కాంగ్రెస్ నేత ప్రేమ్‌కుమార్‌గౌడ్

బండ్లగూడ: అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నాణ్యత ప్రమాణాలను తప్పక పాటించాలని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా నాయకుడు ప్రేమ్‌కుమార్‌గౌడ్ సూచించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కాలనీలో 60 ఫీట్ల రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారులు ఎప్పటికప్పుడు పనులను పరిశీలిస్తూ నాణ్యత లోపాలు లేకుండా చూడాలని కోరారు. ప్రజలకు అభివృద్ధి పనులు నాలుగు కాలాల పాటు అందుబాటులో ఉండేలా చిత్తశుద్ధితో పనులను చేపట్టాలన్నారు.

వేడుకగా అయ్యప్ప స్వామి పడి పూజ



అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ రాంబాగ్‌లోని హుడా కాలనీలో అయ్యప్ప స్వామి మహా పడి పూజను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కత్తి స్వామి రాజుగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజను ఉదయ్‌గౌడ్ గురుస్వామి నిర్వహించారు. భజన మండలి ఆధ్వర్యంలో ఆలపించిన భక్తిగీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పూజల్లో కొత్త రఘుగౌడ్, గోపిగౌడ్, సంతోష్‌కుమార్, బి.శ్రీనివాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన కూల్చివేతలు



వట్టినాగులపల్లిలో చేపట్టిన కూల్చివేతలు

మణికొండ: ప్రభుత్వ భూమిలో అక్రమంగా వెలసిన మరికొన్ని నిర్మాణాలను రెవెన్యూ అధికారులు రెండవ రోజైన శుక్రవారం నేలమట్టం చేశారు. గండిపేట మండల పరిధిలోని వట్టినాగులపల్లి రెవెన్యూలోని సర్వే నెంబర్ 132లో కొందరు అక్రమంగా పెద్ద ఎత్తున నిర్మాణాలను చేపట్టారు. ఆ విషయంపై తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదులు రావటంతో వాటిని కూల్చివేయాలని సిబ్బందిని ఆదేశించారు. దాంతో గురువారం పది నిర్మాణాలను కూల్చివేశారు. మరికొన్నింటిలో కొందరు నివసిస్తుండటం, కొన్ని నిర్మాణాలను కూల్చకుండా స్థానికులు అడ్డుకోవటంతో గురువారం కొన్నింటిని వదలేశారు. శుక్రవారం గచ్చిబౌలి పోలీసుల బందోబస్తు తీసుకుని నిర్మాణాలలో ఉన్న వారిని కాళీ చేయించి అందులోని సామాగ్రిని బయట పెట్టించి నేలమట్టం చేశారు. తమకు నోటీసులు ఇచ్చి కూల్చాలని, అకస్మాత్తుగా కూల్చివేస్తే నిర్మాణాలలో ఉన్న వారు ఎటువెల్లాలని కొందరు అధికారులతో వాదించారు. కూల్చివేతలను అడ్డుకుంటే క్రిమినల్ కేసులు పెట్టాల్సి వస్తుందని అధికారులు బెదిరించటంతో స్థానికులు మిన్నకున్నారు. శుక్రవారం మొత్తం నాలుగు నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలాల జోలికి వస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని, కబ్జాల వెనక ఎవరున్నారనే విషయాన్ని తెలుసుకుంటున్నామన్నారు. సూత్రదారులపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకి పంపే పనిలో ఉన్నామన్నారు.

పగిలిన పైప్‌లైన్: తాగునీరు వృథా



పైప్‌లైన్ పగలటంతో వృథాగా పోతున్న నీరు

మణికొండ: నార్సింగి రిజర్వాయర్ నుంచి అలకాపూర్ టౌన్‌షిప్‌లోని కొంత భాగానికి నీటిని అందించే పైప్‌లైన్ శుక్రవారం సాయంత్రం పగిలిపోయింది. హైటెన్షన్ వైర్ల కింద రోడ్డు నెంబర్ 16 వెనకవైపు పైప్ పగిలిపోవటంతో నీరంతా కొద్ది సేపు వృథాగా పోయింది. స్థానికులు జలమండలి అధికారులకు విషయం తెలపటంతో వెంటనే నీటి సరఫరాను నిలిపివేశారు. రోడ్డులో భారీ వాహనాలు తిరగటంతో పైపులపై ఒత్తిడి పెరిగి పగిలిపోతున్నాయని జలమండలి అధికారులు తెలిపారు. శనివారం మరమ్మతు పనులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని వారు వివరించారు.